www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
బుధవారం 19.02.2025

**విలేఖరులు కావలెను**



కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003




# భద్రతకు పెద్దపీట

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- సైబర్ నేరాల నియంత్రణలో రాష్ట్రాన్ని రోల్ మోడల్ చేస్తాం
- తెలంగాణను దేశంలో అగ్రభాగాన నిలుపుతాం

2లో



## స్టార్టప్‌ల అభివృద్ధికి
# కీలక ఒప్పందం

- బ్రెజిల్ కు చెందిన గోయాస్ హబ్ తో అవగాహన ఒప్పందం
- తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు
- గో యాస్ హబ్ ప్రతినిధులతో ఫలించిన ముఖ్యమంత్రి చర్చలు

2లో




# పుణ్యస్నానాలు @ 55 కోట్లు!

లక్నో: దేశంలోని 45 శాతం మంది భక్తులు ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో ఇప్పటికే పుణ్య స్నానాలు ఆచరించారని లెక్కలు చెబుతున్నాయని అధికారులు చెప్పారు. సోమవారం వరకు 55 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని అన్నారు. ఈ లెక్కన చూస్తే మరో వారం రోజుల్లో ఈ సంఖ్య 60 కోట్లకు పైగా చేరుకుంటుందన్నారు. చివరి రోజులు కావడంతో భారీగా భక్తులు పుణ్య స్నానాలకు పోటెత్తుతున్నారని తెలిపారు. మరోవైపు ప్రయాగ్ రాజ్ కు వచ్చే రైళ్లన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. 12 గంటలపాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇప్పటికీ 10 కిలోమీటర్ల ముందే వాహనాలను నిలిపివేసే చర్యలు కొనసాగిస్తున్నారు. మరో వైపు కుంభమేళాకు దారితీసే ఎనిమిది దారుల్లోనూ 25 కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ లు ఏర్పడ్డాయి. పోలీసులు, అధికారులు, సైన్యం అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద ఎత్తున భక్తులు పుణ్య స్నానాలు ఆచరించిన ఉదాహరణలు ఎక్కడా లేవు.



కలంజ్యోతి
బుధవారం 19.02.2025



## స్టార్టప్‌ల అభివృద్ధికి కీలక ఒప్పందం

- బ్రెజిల్ కు చెందిన గోయాస్‌హబ్‌తో అవగాహన ఒప్పందం
- తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు
- గో యాస్ హబ్ ప్రతినిధులతో ఫలించిన సీఎం చర్చలు

**కలంజ్యోతి, హైదరాబాద్ :**
స్టార్టప్ ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్ కు చెందిన గోయాస్ హబ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో గో యాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ పౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్లోని గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ప్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయని ఇరు దేశాల ప్రతినిధులు వెల్లడించారు. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రిటెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటామని చెప్పారు. మార్కెట్ యాక్సెస్ తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై కలిసి పని చేస్తామన్నారు. మన దేశంతో పాటు బ్రెజిల్ స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# భద్రతకు పెద్దపీట

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- సైబర్ నేరాల నియంత్రణలో రాష్ట్రాన్ని రోల్ మోడల్ చేస్తాం
- తెలంగాణను దేశంలో అగ్రభాగాన నిలుపుతాం



**కలంజ్యోతి, హైదరాబాద్ :**
సమాజానికి ఒక సవాలుగా మారిన సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణను దేశానికే రోల్ మాడల్‌గా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఆకాశమే హద్దుగా కొత్త రూపాలు సంతరించుకుంటున్న సైబర్ నేరాలను అరికట్టడంలో పరిమితమైన విధానాలతో కేవలం ఒక రాష్ట్రం చేసే ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వవని, రాష్ట్రాలన్నీ సమన్వయంతో దేశం ఒక యూనిట్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలో 'బాధితులకు రక్షణ కవచంగా సైబర్ భద్రత డిజిటల్ భవిష్యత్తు' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 'సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ 2025'ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా రూపుదిద్దుకున్న సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్, సైబర్ ఫ్యూజన్ సెంటర్ ను ప్రారంభించిన సీఎం సైబర్ నేరాలను నియంత్రించడంలో జాతీయస్థాయిలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని కేంద్ర ప్రభుత్వం కితాబిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మారుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని, తొలి ప్రయత్నంగా అందుకు అవసరమైన ఒక వారధిని నిర్మించేందుకు చొరవ తీసుకున్నందుకు తెలంగాణ సైబర్ క్రైమ్ విభాగాన్ని సీఎం అభినందించారు. సైబర్ క్రిమినల్స్ ఇటీవలి కాలంలో దాదాపు రూ.22 వేల కోట్లు కాజేసినట్టు అంచనాలు వచ్చాయన్నారు. ప్రజల జీవన స్థితిగతులను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి ప్రమాదకరమైన పరిణామాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. దాంతో పాటు ఫేక్‌న్యూస్, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచార వ్యాప్తి సమాజానికి చేటు కలిగిస్తున్నాయన్నారు. సమాజంలో కొంతమంది జరగని నేరాలు జరిగినట్టు, జరగని దాడులు జరిగినట్టు లేదా మరో కారణం చేతనైనా డీప్ ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్నారని, ఆర్థిక నేరాలతో పాటు ఇలాంటి వాటన్నింటినీ నియంత్రించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సైబర్ నేరాలను అరికట్టడానికి ఐటీ సంస్థలు, నిపుణులతో కలిసి తెలంగాణ నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఈ నేరాలను అరికట్టడంలో 24 గంటలూ సైబర్ హెల్ప్ లైన్ 1930 పని చేస్తుందని చెప్పారు. దానిపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. గతేడాది తెలంగాణలో కొత్తగా 7 సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించామన్నారు. సైబర్ నేరాలతో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పోలీసులకు సూచించారు. నేరం చేసిందెవరని గుర్తించడం, వారిని పట్టుకోవడం, శిక్షించడం వంటి అనేక సవాళ్లతో పాటు అసలు నేరం జరక్కుండా నిరోధించాల్సిన బాధ్యత కూడా పోలీసులపైనే ఉందన్నారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఆయా రాష్ట్రాలతో సమన్వయం సాధించడానికి దేశంలో ఒక కనెక్టింగ్ బ్రిడ్జ్‌లా ఈ సదస్సు ద్వారా ప్రయత్నించడం అభినందనీయమన్నారు. సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణ ఈ దేశానికే రోల్ మాడల్‌గా నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ కార్యదర్శి రవిగుప్తా , రాష్ట్ర డీజీపీ జితేందర్ , తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ , సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతీ వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్‌లో సత్తాచాటిన డఫోడిల్స్

**పాఠశాల స్థాయి నుంచే ఒలింపియాడ్ విద్యపై దృష్టిపెట్టాలి**

**పాఠశాల కరస్పాండెంట్ చింతల నరేందర్**

**కలంజ్యోతి, నర్సంపేట :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్, మెడికల్ సీటు సాధించడం కష్టతరంగా మారింది. పాఠశాల స్థాయి నుంచే ఉత్తమ ఒలింపియాడ్ విద్యపై దృష్టి పెడితే నేటి కాలంలో సీటు సాధించడం సులభమవుతుందని డఫోడిల్స్ (సీబీఎస్ఈ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరేందర్ అన్నారు. నర్సంపేట పట్టణానికి చెందిన డఫోడిల్స్ సీబీఎస్ ఈ పాఠశాల విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒలంపియాడ్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో సత్తా చాటిన సందర్భంగా విద్యార్థులుకు ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు రాబోయే పరీక్షల్లో కూడా కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సాయి, కీర్తన, రోహిత్ , ప్రధానోపాధ్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రీటా, శశికల,హెచ్.ఆర్.డి విజయలక్ష్మి, అనూష ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# బంజారాల అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**కలంజ్యోతి, జగిత్యాల :** బంజారాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో బంజారా భవన్ వద్ద సేవాలాల్ మహారాజ్ 286 జయంతి (భోగ్ భండార్) ఉత్స వాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నా రు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దురాచారాలను అశాస్త్రీయమైన అపోహలను నమ్ముతూ జీవిస్తున్న బంజారా జాతులను తన ఆలోచనలు ప్రసంగాలతో చైతన్యపరిచిన సేవా లాల్ మహారాజ్ అని సేవాలాల్ మహారాజ్ ఒక సంఘసంస్కర్త బంజారాల ఆరాధ్య దైవం ప్రకృతి ప్రేమికుడు ఆధ్యాత్మిక గురువు బంజారాల సం స్కృతి సాంప్రదాయాలను పరిరక్షణకు కృషి చేసిన గొప్ప వ్యక్తి కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో బంజారాల అభివృద్ధి కి, ఆత్మ గౌరవానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కృషి చేస్తాన న్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బంజారాలకు పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఏర్పాటుకు రూ.1 కోటి 10 లక్షల నిధులు కేటాయించగా, స్థలం మంజూరు చేయగా స్థల సమస్య ఉందని, వచ్చే మార్చిలో మరొక స్థలం కేటాయించడం గురించి జిల్లా కలెక్టర్, అధికారులకు విన్నవించడం జరిగిం దన్నారు. జిల్లా బంజారా భవన్ నిర్మాణం కోసం రూ.50 లక్షల నిధులు మంజూరుకు ముఖ్య మంత్రి ,ప్రిన్సిపాల్ సెక్రటరీనీ కోరడం జరిగిందని, ప్రతి ఏడాది సేవాలాల్ జయంతి కి రూ.10 లక్షల నిధులు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో ఏకలవ్య పాఠశాల మంజూరు కోసం ఎంపీ అర్వింద్తో కలిసి కేంద్ర మంత్రినీ సైతం కలవడం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ లైబ్రరీ డైరెక్టర్ చేట్పల్లి సుధాకర్, దశరత్ నాయక్, భూక్యా నరేందర్, అజ్మీరా సంతోష్ నాయక్, అరుణ్, ప్రభాకర్, నందు నాయక్, ధర్మాజీపేట్ చిరంజీవి, రాజునాయక్, బంజారా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**కలంజ్యోతి, నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో జరిగిన సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాదిగ రిజర్వేషన్ ఏ,బీ,సీ వర్గీకరణ అమలు చేసేందుకు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన వర్గీకరణలో ఆమోదించిన రేవంత్ రెడ్డికి పోరాట సమితి నుంచి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈదునూరి ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ, వడ్డూరి కుమార్ దళితరత్న, ఇటికాల సంజీవయ్య, కందిక వీరస్వామి, నల్గొండ సమ్మయ్య మన ప్రేమికుడు, కంకణాల మహేష్, మాదారం పీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా రేవ.ప్రభుదాస్

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరు గ్రామంలో మంగళవారం 'రివైవల్ క్రిస్టియన్ సెంటర్' లో భీమదేవరపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా రెవ.టి. సుదర్శనం, అధ్యక్షులుగా రెవ. పి.ప్రభుదాస్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా పాస్టర్ పి.జిజో వర్గీస్, సెక్రటరీగా పాస్టర్ కే.సదానందం, ట్రెజరర్ గా కే.సృజన్ , పాస్టర్ బి.మోహన్ లాజరస్, పాస్టర్ కే.రత్నంబాబు, పాస్టర్ ఎం.సామ్యూల్, పాస్టర్ జి. బాబులు ఎన్నికయ్యారు.

## భవానీ శంభులింగేశ్వర స్వామి మహోత్సవానికి రూ.50 వేల విరాళం

**కలంజ్యోతి, రుద్రంగి :** మహా శివరాత్రి పురస్కరించుకుని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని శ్రీభవాని శంభులింగేశ్వర స్వామి జాతరతో పాటు ఈ నెల 27న అన్నదానం కార్యక్రమనికి మానాల తుక్యానాయక్ తండాకు చెందిన గుగులోత్ కిస్టునాయక్ యశోద గార్ల తనయుడు గుగులోత్ రఘుపతినాయక్ ప్రియాంక జాతర మహోత్సవానికి రూ.50 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు గుగులోత్ రఘుపతిని శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్లు కొండ రాజేందర్ పిసరీ భూమయ్య, తుమ్ జలపతి, జక్కు మోహన్ గ్రామస్థులు పాల్గొన్నారు.





## స్రవంతి అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన చెవులమద్ది స్రవంతి (29) అనే నిండు గర్భిణి సోమవారం ఓ ప్రవేట్ ఆస్పత్రిలో కడుపులో బిడ్డతో సహా మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం స్రవంతి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. స్రవంతి అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొంగ ఆనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, మ్యాక లక్ష్మణ్, శనిగారపు తిరుపతి, నేరెళ్ళ సతీష్ రెడ్డి, మిల్త్రి శ్రీను, తాళ్ళ హరినాథ్, నక్క అనిల్, జలంధర్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## మల్లికార్జునుడికి ఎమ్మెల్యే పూజలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** నర్సాపూర్ నియోజకవర్గంలో శివంపేట మండలం చేనాపూర్ గ్రామంలో జరిగే శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల్లో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. మల్లికార్జునుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి సంవత్సరం జరిగే మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలను గ్రామ ప్రజలు కలిసి ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలను సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని ఆమె వేడుకున్నారు.



# కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా వామపక్ష పార్టీల నిరసన



**కలంజ్యోతి, నిర్మల్ :** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కు నిరసనగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళ వారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ రైతులను, కార్మికులను, పేదలను పక్కనపెట్టి కార్పొరేట్ అనుకూల బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని విమర్శించారు. వామపక్ష పార్టీలు ఇచ్చిన దేశవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యతిరేకిస్తూ నిరసన చేప ట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కె రాజన్న మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. రైతాంగం త మకు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, రుణాలన్నింటిని మాఫీ చేయాలని డిమాండ్ చేస్తుండగా వాటి గురించి కనీసం బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయిం చకపోవడం దారుణ మని విమర్శించారు. ప్రధా నంగా దేశవ్యాప్త నిరుద్యోగులకు ఉపాధి అవ కాశాలు కల్పించే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పరిశ్రమల రూపక ల్పనకు ఉపాధి పెంచే చర్యలు చేపట్టకపోవడం, మరోవైపు కార్పోరేట్లకు అనేక రాయితీలు ప్రకటిస్తూ బడ్జెట్ ని రూపొందించడం ప్రభుత్వ కార్పొరే ట్ అను కూల విధానాన్ని సూచిస్తున్నదని విమ ర్శించారు. ఉపాధి హామీ లాంటి పథకాలకు నిధులను పెంచకుండా ప్రభుత్వం తగ్గించుతోం దన్నారు. కనీసం 200 రోజుల పని, రోజుకు రూ.600 కూలీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అప్పులు ప్రభుత్వ బడ్జెట్ను మించిపో యాయని, ఈ అప్పులు కార్పొరేట్ల రుణాల మాఫీ కోసం కాదా? అని ప్రశ్నించారు. తక్షణమే రైతు కార్మిక ప్రజా అనుకూల బడ్జెట్లను మార్చవలసిన అవస రం ఉందని సూచించారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, ఉపాలి. ఎస్ గంగన్న, వెంకటేష్, మహమూద్, అనంత రావు దుర్గే, పుండలిక్, తదితరులు పాల్గొన్నారు.



## వేమన పద్యాల పుస్తకాల అందజేత

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ హై స్కూల్ విద్యార్థులకు వేమన ఆధ్యాత్మిక పుస్తకాలను మంగళవారం అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయురాలు ముదురు పద్మ అందించిన పుస్తకాలను సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించు కోవాలన్నారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మహిళా చట్టాలపై అవగాహన

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** మండలంలోని ముల్కనూరు గ్రామంలో మార్గదర్శి మహిళా అభ్యుదయ సంస్థ సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, సఖి కేసు వర్కర్ భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ ముఖ్య ఉద్దేశాలు, అందించిన సేవలను వివరించారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. మహిళలపై గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు జరిగినప్పుడు సఖి సెంటర్ పనిచేస్తుందని అన్నారు.




## విద్యార్థులకు స్కాలర్షిప్‌లు

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చెందిన 14 మంది బాలికలకు మంగళవారం మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్ లు అందజేశారు. ఒక్కొక్కరికి రూ.8 వేల చొప్పున స్కాలర్షిప్ అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మలబార్ ట్రస్ట్ సభ్యులను ప్రిన్సిపాల్ అభినందించారు.



## భజన మండలి నిర్వాహకుడికి సత్కారం

**కలంజ్యోతి, మల్యాల:** మల్యాల మండల కేంద్రంలోని శ్రీభక్త మార్కండేయ ఆలయ భజన మండలి నిర్వాహకుడు బండారి అశోక్ ను మంగళవారం సత్కరించారు. భజన మండలి ఏర్పాటు చేసి 3 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సభ్యులందరూ ఆలయ అర్చకుడు కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ప్రతి సోమవారం రాత్రి ఆలయంలో భజన కార్యక్రమంతో పాటు, మాస శివరాత్రి రోజు లింగాష్టకం పఠనం చేపట్టడం జరుగుతుందని అశోక్ తెలిపారు.



## క్రీడలతో మానసిక వికాసం

### మండల విద్యాధికారి వాసం భీమయ్య

**కలంజ్యోతి, జగిత్యాల :** క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయిని విద్యాధికారి వాసం భీమయ్య అన్నారు. జగిత్యాల పట్టణంలోని గోవిందుపల్లె, విద్యా నగర్ గౌతమ హై స్కూల్ విద్యార్థులకు ఎడ్ల అంగడి రామాలయం ప్రాంగణంలో జరిగిన వార్షిక స్పోర్ట్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి వాసం భీమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వలన విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని, మెదడు చురుకుగా పని చేసి చదువుల్లో రాణిస్తారని, ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన స్కూల్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ కంది కైలాసం, ఆలయ కమిటీ మెంబర్లు అశోక్ రావు, వెంకట్ రావు, విఠలయ్య, చిరంజీవి, నర్సింగరావు, మురళీ మనోహర్ చారీ, డీసీఈబీ, బీజేపీ పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, తపస్ ఉపాధ్యాయ సంఘ నాయకులు వోడ్నాల రాజశేఖర్, పాఠశాల కరస్పాండెంట్ కంది అన్నపూర్ణ కైలాసం, స్కూల్ సిబ్బంది కవిత ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్యాలలో జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండలంలో రెండు రోజులుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. మంగళవారం మల్యాల టౌన్ లో బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. తమ పార్టీ బలపరిచిన పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులను మొదటి ప్రాదాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, నాయకులు బోట్ల ప్రసాద్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొంగ అనందరెడ్డి, శనిగారపు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.





## సూపర్ స్టార్ సినిమాలో

# బుట్టబొమ్మకు ఛాన్స్

'ఒక లైలా కోసం' సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన పూజా హెగ్డే.. ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన అనతి కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. మొదటి మూవీతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ.. అల్లు అర్జున్ 'అలా వైకుంఠపురం' చిత్రంతో టాలీవుడ్‌లో బుట్టబొమ్మగా పేరు తెచ్చుకుంది. అనంతరం వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోయింది. అయితే.. ఆ తర్వాత వచ్చిన వరుస సినిమాలు డిజాస్టర్‌గా మిగిలాయి.. దాంతో ఐరన్ లెగ్‌గా కూడా ముద్ర వేసుకుంది. దాంతో కొంతకాలం సినిమాలకు గ్యాప్ ఇచ్చిన బుట్టబొమ్మ మళ్లీ ఫామ్ లోకి వచ్చి వరుస సినిమాలు చేస్తూ సందడి చేస్తుంది. ఈ క్రమంలోనే రీసెంట్‌గా 'దేవా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అలాగే.. 'రెట్రో', 'జన నాయగన్', దుల్కర్ సల్మాన్ తో ఒక మూవీ ఇలా మూడు, నాలుగు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ బ్యూటీ మరో స్టార్ ఆఫర్ అందుకున్నట్లు తెలుస్తోంది. సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం 'జైలర్-2'తో బిజీగా ఉన్నారు. అలాగే.. లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రం కూడా అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్న నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహిర్, శృతి హాసన్ తదితరులకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ కూడా రిలీజ్ చేశారు చిత్ర బృందం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. అలాగే.. ఈ సినిమాలో ఓ ఐటెమ్ సాంగ్ ఉందని తెలుస్తుండగా.. ఈ స్పెషల్ సాంగ్ కోసం పూజా హెగ్డేను తీసుకున్నట్లు తమిళ చిత్ర సీమలో వార్తలు వస్తున్నాయి. అయితే.. వైరల్ అవుతున్న ఈ వార్తల్లో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ సూపర్ స్టార్ సినిమాలో పూజా హెగ్డే స్పెషల్ సాంగ్‌లో చేస్తుందా వావ్ అంటూ పలువురు కామెంట్స్ చేస్తున్నారు.